క్లుప్తంగా

నేడు గ్రామ సందర్శన

బొబ్బిలి రూరల్: మండలంలోని కొత్తపెంట గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. నోడల్ ఆఫీసర్ మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రామమందిరం నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామపెద్దలు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో రామమందిరం నిర్మాణానికి పలువురు గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు బుధవారం భూమిపూజ చేశారు. ఐకమత్యంతో ఆలయ నిర్మాణానికి ముందుకువచ్చామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి వచ్చేలా చూస్తామన్నారు.

పశువులకు 'గాలికుంటు' నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

తెర్లాం: మండలంలోని ఆర్.గదబవలస గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు బుధవారం వేశారు. ఏటా వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఈ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి నరేంద్రకుమార్ తెలిపారు. పాడిరైతులంతా తమ వద్ద ఉన్న పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాలువల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం గ్రామంలో 15వ ఆర్థికసంఘం నిధులతో చేపడుతున్న సీసీ కాలువల నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోండి



బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు

రేగిడి: స్థానిక భవిత కేంద్రం ద్వారా దివ్యాంగులైన చిన్నారులకు అందజేస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రమాచంద్రిక కోరారు. కేంద్రానికి బుధవారం వచ్చిన పలువురు దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలందించిన ఆమె.. ఆ సేవల ఫలితాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. ఇక్కడ చేసిన తరహాలోనే ఇంటి వద్ద కూడా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావుపాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

బొబ్బిలి: పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉడమల మధు, పతివాడ అప్పారావు ఉన్నారు. వీరికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో పారిశుధ్య పనులు బుధవారం చేపట్టారు. సర్పంచ్ లక్షుంనాయుడు ఆధ్వర్యంలో మురుగు కాలువల్లోని పూడికలను సిబ్బంది తొలగించారు. రోడ్లపై చెత్తాచెదారాన్ని వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించారు. అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

పోలీస్ రక్షణ ఉండాలి..



వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు అమలుచేయాలి. ప్రధాన ఆస్పత్రులతో పాటు ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పోలీస్ రక్షణ ఉండేలా చూడాలి. దేశంలో ఎక్కడో ఓ చోట మహిళా వైద్యులపై లైంగికదాడులు జరుగుతుండడం చాలా విచారకరం. నిందితులకు వెంటనే శిక్ష పడితే దాడులకు మిగతా వారు భయపడతారు. రక్షణ వ్యవస్థ కూడా పక్షపాతం లేకుండా పనిచేయాలి.

– డాక్టర్ జి.లక్ష్మి, పక్కి పీహెచ్‌సీ, బొబ్బిలి మండలం

భయంతోనే ఉద్యోగం చేస్తున్నాం..



గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. రోగులతో సహాయకులుగా వచ్చే వారితో కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిత్యం భయంతోనే ఉద్యోగం చేస్తున్నాం. ప్రతీ ఆస్పత్రి వద్ద పోలీసులు ఉండేలా చూడాలి. అప్పుడే ధైర్యంగా ఉద్యోగం చేయగలుగుతాం. తమ భద్రతకు భరోసానివ్వాలి.

–డాక్టర్ డి.తనూజ, పక్కి పీహెచ్‌సీ, బొబ్బిలి మండలం



బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

వంగర:

మండలంలోని మద్దివలస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అలజింగి సుదర్శనరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. మగ్గూరు ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన అకస్మాత్తుగా మరణించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఉత్తరావెల్లి సరోజినీదేవి, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, వంగర, రేగిడి వైస్ ఎంపీపీలు కిమిడి ఉమామహేశ్వరరావు, టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు ఉన్నారు.



రేగిడి: రామకృష్ణ, కిరణ్‌కుమార్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామానికి చెందిన సత్యసాయి సేవాసంస్థల రాజాం జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, ఆయన కొడుకు కిరణ్‌కుమార్‌లు ఈ నెల 25వ తేదీన శ్రీకాకుళం జిల్లా, రణస్థలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రామకృష్ణ, కిరణ్‌కుమార్ చిత్రపటాల వద్ద నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వి.జగన్‌మోహనరావు, సర్పంచ్‌లు కె.గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, కె.సురేష్, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వంగర: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారిణి శిరీష

రామభద్రపురం: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని వైద్యాధికారిణి ఏఎల్‌జి శిరీష అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జన్నివలస గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన పలువురు రోగులకు ఆమె ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. పెద్దపెద్ద వ్యాధులతో బాధపడుతున్న వారిని, శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ ఇంటికి మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు.

పోలీస్ బందోబస్తు కావాలి



పోలీస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు బందోబస్తు కావాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు కోరుతున్నారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వెళ్లి వినతిపత్రం అందజేశారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జరిగే ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే పోలీసులను కేటాయించాలన్నారు. ఎన్నికల సమయానికి ముందే పోలీసులు పాఠశాల వద్ద ఉంటే ఎటువంటి వివాదాలు లేకుండా సక్రమంగా ఎన్నికల నిర్వహణకు ఆస్కారం ఉంటుందన్నారు. పోలీస్ భద్రత లేకపోతే ఎన్నికలో వివాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు.

మెరుగైన వైద్యం అందించండి



రాజాం సిటీ: రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సంతకవిటి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, వైద్య సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్యం, ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. రోగులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని, ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు యు.నాగేంద్రప్రసాద్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..

రాజాం సిటీ: పీహెచ్‌సీల్లోని వైద్యులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు కోరారు. స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి, సిబ్బందితో సమీక్షించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. జ్వరపీడితుల గుర్తింపు కోసం ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలంతా గ్రామాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్, కె.చంద్రశేఖర్‌రాజు, జె.సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



బహుమతులతో విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లోని విద్యార్థులకు నేత్రదానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా నేత్రదానం చాలా గొప్పదన్నారు. మనం చేసే నేత్రదానం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణించిన ఆరు గంటల్లో నేత్రాలు దానం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి ప్రభావతి జాగృతి ట్రస్టు, పొందూరు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.ఉషారాణి, సీహెచ్ శోభారాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు చేపట్టారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కృష్ణభగవానుడిని దర్శించుకుని, పూజలు చేశారు.

రాజాం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో ఉన్న నిర్మల ఆయిల్‌మిల్లులో కొలువైన శ్రీకృష్ణుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణం చేపట్టారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎం.రామినాయుడు, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ



కోడిశలో రైతులకు ఎరువులు అందిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని కోడిశ, సరసనాపల్లి, అంబాడ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని రైతులకు బుధవారం ఎరువులు పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామని ఏవో మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని 25 రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా, డీఏపీ ఎరువులను రైతులకు అందిస్తున్నామన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సకాలంలో వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కొల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లపై అవగాహన కల్పించండి

రాజాం: పంటపొలాల్లో ఫారంపాండ్‌ల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ఫారంపాండ్‌ల ద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని, ఇదే విషయాన్ని గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో తెలియజేయాలన్నారు. 9 మీటర్ల పొడవు, వెడల్పులతో 2 మీటర్ల లోతులో ఫారంపాండ్‌లు తవ్వాలని, తద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా రూ.50 వేల మేర వేతనం లభిస్తుందన్నారు. దీనికోసం గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకు 50కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటికే 13 నిర్మాణాలకు సంబంధించి, నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలేవీ?

బొబ్బిలి: పట్టణ పరిధిలోని చెరువుల ఆక్రమణలపై చర్యలేవీ అని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో బుధవారం మాట్లాడుతూ ఒక్క బొబ్బిలి పట్టణంలోనే మొత్తం 37కు పైగా చెరువులు ఉండేవని, ఇప్పుడు వాటిలోని చాలా చెరువులు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమన్నారు. చెరువులతో పాటు ఎస్సీ, ఎస్టీల భూములను సైతం కొంతమంది బడాబాబులు ఆక్రమించుకున్నారని, వాటిపై కూడా చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా కోటి చెరువు విస్తీర్ణం 70.62 ఎకరాలు కాగా దానిలోని 20 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. అలాగే యుద్ధ స్తంభం వద్ద ఉన్న భవిరి సాగరం చివరన 80 సెంట్లు కూడా ఆక్రమణదారులు ఆక్రమించుకున్నారన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న మేదరిబందలో కూడా రూ.10 కోట్లకు పైగా విలువైన 5.23 ఎకరాలను ఇళ్లస్థలాలుగా మార్చేశారన్నారు. తెలంగాణలోని హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కనబరచాలి



అంబకండిలో సాగు చేస్తున్న కొబ్బరితోటను పరిశీలిస్తున్న ఏపీవో హరనాధరావు

రేగిడి: ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కనబరచాలని ఏపీవో ఎస్.హరనాధరావు రైతులను కోరారు. మండలంలోని అంబకండి గ్రామానికి బుధవారం వెళ్లిన ఆయన అక్కడి రైతు ఎస్.సూర్యనారాయణ సాగు చేస్తున్న కొబ్బరితోటను పరిశీలించారు. ఉపాధి పథకం ద్వారా సదరు రైతుకు 48 కొబ్బరి మొక్కలు అందించామని, ఇప్పుడు పంట బాగుందన్నారు.

పంట పెంచేందుకు అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అందజేసే మొక్కలతో ఉద్యాన తోటల పెంపకం చేపడుతున్న రైతులకు మూడేళ్ల పాటు పంట సంరక్షణ నిధులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులంతా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట, కంచరాం, పొగిరి, గురవాం తదితర గ్రామ సచివాలయాలను బుధవారం సందర్శించిన ఆయన.. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. పంచాయతీల ఆర్థిక సంఘ నిధులతో పంచాయతీల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. అలాగే పెండింగ్ బిల్లులను కాంట్రాక్టర్లకు వెంటనే చెల్లించాలన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని బుధవారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా, పాఠ్యాంశంపై ఆసక్తి కలిగేలా సిబ్బంది బోధన చేపట్టాలని, మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనాలు వండి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోరు మరమ్మతులు



బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

బొబ్బిలి రూరల్: మండలంలోని రాచేరువలస గ్రామంలో పాడైన తాగునీటి బోరు మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో బోరు పనిచేయకపోవడాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీడీవో పి.రవికుమార్.. మెకానిక్‌లను బుధవారం పంపించి, బోరు బాగుచేయించారు. బోరు వినియోగంలోకి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్లాట్ బుకింగ్ పాయింట్ ఏర్పాటు

బొబ్బిలి: ఇసుక కావాలనుకునే వారి కోసం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేశామని సీఐ కె.సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్పీ వకుల్ జిందల్, జేసీ సేతు మాధవన్‌ల ఆదేశాల మేరకు ఇసుక విక్రయాలు పారదర్శకంగా జరగాలన్న సదుద్దేశ్యంతో ఇసుక డంపింగ్ యార్డు వద్ద చెకింగ్ పాయింట్ కూడా ఏర్పాటు చేశామన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారి లారీలనే ఇసుక కోసం లోపలికి అనుమతి ఇస్తున్నామన్నారు.

రాష్ట్ర విభజన తర్వాత 2,933 కేసుల పరిష్కారం

బొబ్బిలి: రాష్ట్ర విభజన తర్వాత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో నమోదైన మొత్తం 2,933 విద్యుత్ సంబంధిత కేసులను పరిష్కరించామని విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని ఈఈ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తొలుత విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2005 నుంచి ఈ న్యాయస్థానం పనిచేస్తోందని, 104 కేసులను పూర్తిస్థాయిలో పరిష్కరించి, రూ.6.02లక్షల పరిహారాన్ని బాధితులకు అందజేశామన్నారు. వాట్సాప్, ఈ-మెయిల్ లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు సమర్పించవచ్చన్నారు. కేసు తీవ్రతను బట్టి తామే స్వయంగా అక్కడికి వచ్చి కేసు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయస్థానం సభ్యులు వి.జనార్దనరావు, ఈఈ ఆవాల అనంతరావు, ఏడీఈలు ఎం.ఉదయభాను నాయుడు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ



వేప కషాయం తయారీని వివరిస్తున్న ఏవో శ్యామసుందర్



సంతకవిటి: నీమాస్త్రం తయారీని వివరిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని ఏవో శ్యామసుందర్ అన్నారు. మండలంలోని కారాడ గ్రామంలోని రైతులకు వేప కషాయం తయారీ, దాని వినియోగం, ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగిస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ మూడడ్ల సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: నీమాస్త్రంతో చీడపీడల నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. మండలంలోని నారాయణరాజపురం గ్రామంలోని రైతులకు నీమాస్త్రం తయారీ, దాని ఉపయోగాలపై అవగాహన కల్పించారు. 200 లీటర్ల నీరు, 10 లీటర్ల ఆవుమూత్రం, 10 కిలోల ఆవుపేడ, పుట్టమన్ను, మరో 10 కిలోల వేపాకు కలిపి నీమాస్త్రం తయారు చేసి, పంటలపై పిచికారీ చేస్తే చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు.